సాక్షి
మహబూబాబాద్
శుక్రవారం | 22 | సెప్టెంబర్ | 2023

న్యూస్‌రీల్

పంటల పరిశీలన



దోర్నకల్: మండలంలోని రావిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో రైతులు సాగు చేసిన పలు పంటలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఛత్రునాయక్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పత్తి, వరి, మిరప పంటలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఛత్రునాయక్ మాట్లాడుతూ.. వరి, మిరప, పత్తి పంటలను సాగు చేస్తున్న రైతులు వాతావరణానికి అనుగుణంగా యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు ఎర్ర కర్ణ, కె.అవినాష్, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు చార్జీల్లో రాయితీ

నెహ్రూసెంటర్: దసరా పండుగను పురస్కరించుకొని అక్టోబర్ 15నుంచి 29వ తేదీ వరకు ముందస్తు బుకింగ్ చేసుకున్న ఆర్టీసీ ప్రయాణికులకు చార్జీల్లో 10శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఆర్టీసీ మానుకోట డీఎం విజయ్ గురువారం తెలిపారు. హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి పండుగలకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకు ముందస్తు రిజర్వేషన్ చేసుకునే ప్రయాణికులకే ఈ రాయితీ వర్తిస్తుందని, దసరా పండుగ సెలవుల్లో 15 రోజులు మాత్రమే రాయితీ అమలులో ఉంటుందన్నారు.

దుబ్బగూడెంలో మలేరియా అధికారి పరిశీలన



గార్ల: 'డెంగీతో చిన్నారి విలవిల' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యాధికారులు స్పందించారు. మండలంలోని దుబ్బగూడెం గ్రామానికి చెందిన 9నెలల పాప ప్రణీద డెంగీతో బాధపడుతూ హైదరాబాద్ రెయిన్‌బో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. కాగా డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు మలేరియా అధికారి సుధీర్‌రెడ్డి వైద్య సిబ్బందితో కలిసి ప్రణీద ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇంటితో పాటు ఆవరణలో పడావుబడ్డ బావిని సందర్శించి పైరిథ్రీమ్ మందు పిచికారీ చేశారు. పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. డాక్టర్ అవినాష్, డాక్టర్ రవూఫ్, సీహెచ్ఓ కృష్ణార్జున్ రావు, హెచ్ఈఓ శ్రీహరి, హెచ్ఎస్ ఇస్మాయిల్ బేగ్, ఏఎన్ఎంలు కళావతి, నిర్మల, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్లు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లో ఐదు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ఆర్సీఓ ప్రత్యూష గురువారం తెలిపారు. గతంలో ప్రవేశ అర్హత పరీక్ష రాసిన విద్యార్థులు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులని, ఈనెల 23న ఖమ్మం జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు హాల్ టికెట్, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు గురుకుల పాఠశాలల్లో సంప్రదించాలన్నారు.

ఆగని బెరైటీస్ అక్రమ రవాణా



గార్ల: మండలంలో బెరైటీస్ ఖనిజ అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడంలేదు. అక్రమార్కులు దర్జాగా దందా కొనసాగిస్తున్నా.. అటవీశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున మండలంలోని సేరిపురం పంచాయతీ పరిధిలోని బెరైటీస్ గుట్టల నుంచి ఖనిజాన్ని తరలిస్తుండగా పోచారం క్రాస్‌రోడ్ వద్ద ట్రాక్టర్ బురదలో దిగబడటంతో అన్‌లోడ్ చేసి వెళ్లారు. కాగా గతంలో అక్రమార్కులు ఖనిజాన్ని తరలించగా అటవీ అధికారులు బెరైటీస్ గుట్టల చుట్టూ ట్రెంచ్ కొట్టించారు. అయినా దందా కొనసాగుతోంది. కాగా అటవీ అధికారుల హస్తం ఉండడంతోని అక్రమార్కులు యథేచ్ఛగా ఖనిజాన్ని తరలిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అటవీశాఖ అధికారులు స్పందించి ఖనిజ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

'డబుల్' కష్టాలు

ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు

- జిల్లాలో 5,571 ఇళ్లకు.. 1,733మాత్రమే పూర్తి
- పూర్తయిన వాటిలో సౌకర్యాలు కరువు
- రాత్రి అయితే ఆ ప్రాంతాల్లో అంధకారమే
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు



అంతర్గత రోడ్లు లేని మానుకోటలోని డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయం

మహబూబాబాద్: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా డబుల్‌బెడ్రూం ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. అయితే ఏళ్లు గడుస్తున్నా.. ఆశించిన స్థాయిలో నిర్మాణాలు పూర్తికాలేదు. దీంతో పేదలకు ఎదురుచూపులు తప్పడం లేదు. కాగా కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తయి లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించినప్పటికీ సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వీధి దీపాల సౌకర్యం లేకపోవడంతో రాత్రిపూట అంధకారం అలుముకుంటోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులు రాత్రిపూట బయటకు రాలేని పరిస్థితి ఉంది.

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో కేటాయింపు..

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో 360ఇళ్లు మంజూరు కాగా.. 200 నిర్మాణాలు పూర్తయ్యాయి. అలాగే 160 ఇళ్లు స్లాబ్ వరకు నిర్మాణాలు జరిగాయి. కాగా వార్డుల వారీగా సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయించారు. ఆయా ఇళ్లల్లో సుమారు వందమంది లబ్ధిదారులు ఉంటున్నారు. కొంతమంది మాత్రం సమాన్లు పెట్టుకోవడానికి స్థలం సరిపోవడం లేదని అదనపు నిర్మాణాలు చేపడుతున్నారు. రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు ఖర్చు చేసి వారికి అనుకూలంగా నిర్మాణాలు చేసుకుంటున్నారు.

5,571 ఇళ్లు మంజూరు..

జిల్లాకు 5,571 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరయ్యాయి. కాగా మహబూబాబాద్ నియోజకవర్గానికి 1,135 ఇళ్లు, డోర్నకల్ నియోజకవర్గానికి 2,369, పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు, పెద్దవంగర మండలాలకు 1,693, ఇల్లెందు నియోజకవర్గంలోని బయ్యారం, గార్ల మండలాలకు 330, ములుగు నియోజకవర్గంలోని కొత్తగూడ, గంగారం మండలాలకు 44 ఇళ్లు కేటాయించారు. 1,733 ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా 1,313 మంది లబ్ధిదారులను ఎంపిక పూర్తి చేసి 1,096 మందికి ఇళ్లను కేటాయించారు. కాగా నాలుగైదు నెలల నుంచి ఆశించన స్థాయిలో పనులు పూర్తికావడం లేదు.

రాత్రి అయితే అంధకారమే..

మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్ల వద్ద విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్‌దీపాలు అమర్చలేదు. దీంతో రాత్రిఅయితే ఆ పరిసరాలు అంధకారంగా మారుతున్నాయి. దీంతో విషపురుగుల భయంతో ప్రజలు బయటికి రావడానికి జంకుతున్నారు. ప్రధాన రహదారి మినహా అంతర్గత రోడ్ల నిర్మాణాలు చేపట్టలేదు. అలాగే డ్రెయినేజీలు ఇతర నిర్మాణాలు చేపట్టకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి పందులు స్వైరవిహారం చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే కొంతమంది అక్కడ ఉండలేక ఇంటిని రూ.5లక్షల నుంచి రూ.8లక్షల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.



అదనపు నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారుడు

అంతర్గత రోడ్లు నిర్మించాలి



డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు లేక ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే నిర్మాణాలు చేపట్టాలి. కేటాయించిన ఇళ్లు పూర్తిగా అనుకూలంగా లేకపోవడంతో డబ్బులు ఖర్చు చేసి అదనపు నిర్మాణాలు చేసుకున్నాం.

– డి.వీరన్న, లబ్ధిదారుడు, మానుకోట

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి



విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేశారు, కానీ వాటికి లైట్లు అమర్చలేదు. రాత్రి అయితే డబుల్ బెడ్రూం ఇళ్ల పరిసరాలు చీకటిగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు సక్రమంగా లేక చీకటిలో కిందపడితే దెబ్బలు తగిలాయి. ముందుగా వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.

– ఎస్.రమ, లబ్ధిదారురాలు, మానుకోట

సంఘాలతో చర్చలు జరపాలి





బారికేడ్లను నెట్టుకొని మంత్రి క్యాంపు కార్యాలయం వైపు వెళ్తున్న అంగన్‌వాడీలు

సమ్మెను ఉధృతం చేస్తాం

- మంత్రి సత్యవతిరాథోడ్ తప్పుడు ప్రకటనలు చేయడం సరికాదు
- సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు, అజయ్‌సారథిరెడ్డి
- మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడించిన అంగన్‌వాడీలు
- సుమారు రెండు గంటల పాటు ఆందోళన



మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు

మహబూబాబాద్: రాష్ట్ర మంత్రి సత్యవతిరాథోడ్ సమ్మె చేస్తున్న సంఘాల నాయకులు, అంగన్‌వాడీ యూనియన్ల నాయకురాళ్లతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు, అజయ్‌సారథిరెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ల నాయకురాళ్లు ఎల్లారీశ్వరి, స్నేహ బిందు, తిరుపతమ్మ, సంపూర్ణ డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా గురువారం అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు ర్యాలీగా మంత్రి క్యాంపు కార్యాలయం(ఇల్లు) సమీపానికి చేరుకున్నారు. ఈక్రమంలో టౌన్ సీఐ సతీష్ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయం ఎదుట ముగ్గురు ఎస్సైలతో బందోబస్తు నిర్వహించారు. అయితే సీఐ మాట్లాడుతుండగానే.. అంగన్‌వాడీలు మరోమార్గంలో బారికేడ్లను నెట్టుకొని క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన చేశారు. అంగన్‌వాడీల సంఖ్య ఎక్కువగా ఉండి పోలీసులు తక్కువగా ఉండడంతో ఆందోళనను అడ్డుకోలేకపోయారు.

తప్పుడు ప్రకటనలు సరికాదు..

అంగన్‌వాడీలకు దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని వేతనాలు తెలంగాణలో ఇస్తున్నామని మంత్రి సత్యవతిరాథోడ్ తప్పుడు ప్రకటనలు చేయడం సరికాదని సంఘాల నాయకులు, యూనియన్ నాయకురాళ్లు అన్నారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, రెగ్యులరైజ్ చేయాలని పలు డిమాండ్లతో అంగన్‌వాడీలు 11రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె విరమించాలని అధికారులు అంగన్‌వాడీలను ఒత్తిళ్లకు గురిచేయడం సరికాదన్నారు. సమ్మె చేస్తున్న సిబ్బంది కేంద్రాల తాళాలు పగులకొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కుంట ఉపేందర్, రేషపల్లి నవీన్, శ్రావణ్, సమ్మె రాజమౌళి, నాగన్న, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంపదను పరిరక్షించాలి

- కలెక్టర్ శశాంక



భీమునిపాదం జలపాతం వద్ద సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

గూడూరు: అటవీ సంపద పరిరక్షణకు పాటుపడాలని కలెక్టర్ శశాంక అన్నారు. మండలంలోని సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప దట్టమైన అడవిలోని భీమునిపాద జలపాతం వద్ద గురువారం జరిగిన జిల్లాస్థాయి అటవీ సంరక్షణ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం ఓ వైపు అటవీ సంపదను రక్షించే చర్యలు చేపట్టడంతో పాటు కొన్ని సంవత్సరాలుగా అడవుల్లో సాగు చేసుకుంటున్న వారికి ఆర్ఓఎఫ్ఆర్ హక్కు పత్రాలు అందజేసిందని తెలిపారు. సాగు భూములకు దగ్గరలోని అడవులకు ఎలాంటి సంబంధం లేకుండా కందకాలు తీయించాలని సూచించారు. అడవుల్లో చెట్లను నరికితే ఎంతటివారైనా సరే కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైనప్పుడు రెవెన్యూ, పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వన్యప్రాణుల సంరక్షణపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి, వాటి సంరక్షణ కోసం అన్ని శాఖల అధికారుల సహకారం ఉండేలా కార్యాచరణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ రవికిరణ్, ఎస్పీ చంద్రమోహన్, జెడ్పీ సీఈఓ రమాదేవి, డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఆర్డీఓ అలివేలు, ఎఫ్‌డీఓ క్రిష్ణమాచార్య, గూడూరు ఎఫ్ఆర్వో సురేష్, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీఓ రోజారాణి, ఏపీఓలు, ఈసీలు, ఫారెస్టు రేంజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


కొత్తరుణాలు మంజూరు చేయాలి

మహబూబాబాద్: ఈ నెలాఖరు వరకు రైతులకు కొత్తరుణాల మంజూరు పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం పంటరుణాలు, రైతు రుణమాఫీపై బ్యాంకు మేనేజర్లు, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతు రుణాలకు సంబంధించిన డాక్యుమెంట్లను ఎల్‌డీఎంకు అందజేయాలని ఆదేశించారు. సత్వరమే రైతు రుణాలు మంజూరుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో ఎల్‌డీఎం సత్యనారాయణమూర్తి, జిల్లా ఉద్యానశాఖ అధికారి సూర్యనారాయణ, డీఏఈ ఛత్రునాయక్, డీసీఓ కుర్షీద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేయాలి

గంగారం: మండల అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ శశాంక అన్నారు. మండల కేంద్రంలో నీతి ఆయోగ్ సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఏజెన్సీ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నీతి ఆయోగ్‌లో ఎంపిక చేయడం జరిగిందన్నారు. అందరు సమష్టిగా కృషి చేసి అభివృద్ధి చేయాలని సూచించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రతిజ్ఞ చేశారు. జెడ్పీ సీఈఓ రమాదేవి, ఎంపీపీ సువర్ణపాక సరోజన జగ్గారావు, జెడ్పీటీసీ ఈసం రమ, ఎంపీడీఓ అపర్ణ ఉన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలి




ఎన్నికల ఫారాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ

గూడూరు: మండలంలో ఓటరు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆర్డీఓ అలివేలు సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికలు ఫారాల ను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, రైతులకు అవసరమైన పనులను వెంటనే పూర్తి చేయాలని, అవసరమైన సర్టిఫికెట్లను తొందరగా అందించాలని తహసీల్దార్ అశోక్ కుమార్‌కు సూచించారు.

పీహెచ్‌సీలో రగడ..

- మెడికల్ ఆఫీసర్, స్టాఫ్‌నర్సు మధ్య వివాదం
- డీఎంహెచ్ఓకు ఫిర్యాదు, విచారణ



వైద్యసిబ్బందిని విచారిస్తున్న డీఎంహెచ్ఓ అంబరీష

దంతాలపల్లి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్, స్టాఫ్‌నర్సు మధ్య నెల కొన్న వివాదం చిలికి చిలికి గాలివానగా మారింది. వారిద్దరి మధ్య సమన్వయం కొరవడటంతో రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదని వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదుల అందాయి. దీంతో డీఎంహెచ్ఓ ఆస్పత్రిని సందర్శించి విచారణ చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆస్పత్రిలో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్ చైతన్య, స్టాఫ్‌నర్సు కవిత మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో తాను చెప్పిన మాట స్టాఫ్‌నర్సు వినడం లేదని మెడికల్ ఆఫీసర్ చైతన్య జిల్లా వైద్యాధికారి అంబరీషకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం ఆస్పత్రిని సందర్శించిన డీఎంహెచ్ఓ అక్కడ ఉన్న ఇతర ఉద్యోగులతో మాట్లాడారు. డాక్టర్, స్టాఫ్‌నర్సుల ప్రవర్తన, పనితీరు మొదలైన అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇరువురు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వైద్యాధికారి చెప్పినట్లు వినాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని స్టాఫ్‌నర్సుకు సూచించారు. మరోసారి ఇలా జరిగితే చర్య తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంపై డీఎంహెచ్ఓ 'సాక్షి'తో మాట్లాడుతూ.. పంచాయితీ జరిగిన విషయంపై విచారణ చేపట్టామని, ముందుగా హెచ్చరిక జారీ చేశామన్నారు. పనితీరు మారకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మేడారంలో సకల సౌకర్యాలు

వచ్చే ఏడాదిలో జరగనున్న మేడారం మహాజాతరకు సకల సౌకర్యాలు కల్పిస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి గురువారం మేడారం చేరుకున్న ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన అనంతరం అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.

– ఎస్ఎస్ తాడ్వాయి

- 8లో▸



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేసి మొక్కుతున్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతిరాథోడ్

జిల్లా జడ్జి జైలు సందర్శన



మానుకోట జైలును సందర్శిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్

మహబూబాబాద్ రూరల్: హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్ మహబూబాబాద్ సబ్ జైలును గురువారం సందర్శించారు. ఖైదీల యోగక్షేమాలు, వారి కేసుల వివరాలు, వారు ఎంతకాలం నుంచి జైల్లో ఉంటున్నారో అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని నియమించుకోలేని ఖైదీల వివరాలు తెలుసుకున్నా రు. మహిళా ఖైదీల వసతులను పరిశీలించారు. సీనియర్ సివిల్ జడ్జి సురేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మౌనిక, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ భిక్షపతి, ఏఎస్సైలు రవీందర్, సదానిరంజన్ ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని చిన్నవంగర గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పాకనాటి సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు 20 మంది బీఆర్ఎస్‌లో మంత్రి సమక్షంలో చేరారు. మంత్రి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి దయాకర్‌రావు మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను ఇంటింటికీ వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాదని తెలిసి బూటకపు హామీలు ఇస్తున్నారని దుయ్యాబట్టారు. సంక్షేమ పథకాలతో పాటు జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈదురు ఐలయ్య, రామచంద్రయ్య శర్మ, కాకిరాల హరిప్రసాద్, పాకనాటి సోమారెడ్డి, విజయ్‌పాల్ రెడ్డి, శేఖర్, బొమ్మెర నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇమాముద్దీన్‌పై చర్య తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ విద్యార్థులను పరుష పదజాలంతో దూషించి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, ఎవరి మరుగుదొడ్లు వారే శుభ్రం చేసుకోవాలని, ఏమైనా ఆరోగ్య సమస్యలు వస్తే పట్టించుకోవడం లేదన్నారు. కళాశాలలో 42మంది విద్యార్థులకు కండ్ల కలక వస్తే నిర్లక్ష్యం వహించారన్నారు. విద్యార్థులకు జ్వరం వస్తే సరైన చికిత్స అందించడం లేదన్నారు. అనంతరం విద్యార్థులు కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి వెళ్లగా జిల్లా మైనార్టీ శాఖ అధికారి బి. శ్రీనివాస్ విద్యార్థులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. విద్యార్థులతో ఎలాంటి అసభ్యకరమైన మాటలు మాట్లాడలేదన్నారు. విషయం తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్ నుంచి వివరాలు సేకరించి రాష్ట్ర మైనార్టీ గురుకులాల కార్యాలయానికి నివేదికను అందజేస్తామని చెప్పారు.

క్లుప్తంగా

24న ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

హనుమకొండ: హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ 24వ తేదీన ఉమ్మడి జిల్లా స్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ వీరయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 30 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిజామాబాద్‌లో నిర్వహించే 42వ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. జనవరి 02, 2008 తర్వాత జన్మించిన వారై ఉండి ఆసక్తి గల బాలబాలికలు 24న ఉదయం 9గంటలకు జేఎన్‌ఎస్‌లోని బ్యాడ్మింటన్ కోర్టు వద్ద తనకు రిపోర్టు చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అవుతారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 98492 01467 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కుంటలో పడి పశువుల కాపరి మృతి

బయ్యారం: ఓ పశువుల కాపరి కుంటలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వినోభానగర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన కొండమీది మల్లయ్య(60) పశువులకాపరిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం మేత నిమిత్తం పశువులను గ్రామ సమీపంలోని జీవికుంట వద్దకు తీసుకెళ్లాడు. కుంటలో దిగిన పశువులు బయటకు రావడం లేదు. దీంతో పశువులను బయటకు తీసుకొచ్చేందుకు కుంటలో దిగాడు. ఈ క్రమంలో కుంటలోని దామెరతీగ చుట్టుకోవడంతో మునిగిపోయాడు. రాత్రి అయిన మల్లయ్య ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం ప్రయత్నించగా గురువారం కుంటలో మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఉపేందర్ తెలిపారు.

మున్నేరువాగులో ఒకరి గల్లంతు


వెంకన్న

మహబూబాబాద్ రూరల్ : మున్నేరువాగులో ఒకరు గల్లంతయ్యారు. ఈ ఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన మోడెం వెంకన్న (35) మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం పనిలేకపోవడంతో గ్రామ శివారులోని మున్నేరువాగు వద్దకు చేపల వేటకు వెళ్లాడు. అనంతరం అక్కడే ఉన్న పృథ్వీ అనే వ్యక్తితో కలిసి మున్నేరువాగు చెక్ డ్యాం మీదుగా అవతలి వైపున ఉన్న గాంధీపురం గ్రామ శివారు వరకు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో చెక్ డ్యాం మీది నుంచి వాగులో పడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. స్థానికులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు.

నిలువెత్తు నిర్లక్ష్యం..

తడిసిన సింథటిక్ ట్రాక్‌పైనే అథ్లెటిక్స్ పోటీలు
- ఇబ్బందులు పడిన క్రీడాకారిణులు
- వర్షంలోనే భోజనం.. తడుస్తూ క్యూలైన్‌లో అన్నం కోసం బారులు
- నిర్వాహకుల పనితీరుపై అసహనం
- కనీస వసతుల కల్పనలో అలసత్వం


వర్షంలో తడుస్తూ భోజనం కోసం క్యూలో నిల్చున్న క్రీడాకారిణులు


షూ లేకుండా తడిసిన ట్రాక్‌పై రన్నింగ్ చేస్తున్న క్రీడాకారిణులు

సాక్షిప్రతినిధి, వరంగల్: వర్షంలో తడుస్తూ అన్నం కోసం క్యూలో నిల్చున్న వీరంతా వినాయక మండపం వద్ద భక్తులు కాదు.. అనేక సంవత్సరాల కఠోర సాధన ఫలితంగా వచ్చే ప్రతిభను చాటేందుకు వచ్చిన యువ క్రీడాకారిణులు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కనిపించిన ఈ చిత్రం క్రీడాభిమానులను కలిచివేసింది. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల ఎంతో దూరం నుంచి వచ్చిన క్రీడాకారిణులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కనీస వసతుల కల్పనలో అలసత్వం వహించడంపై సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు నిర్వాహకుల తీరుపై అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు.

జేఎన్‌ఎస్‌లో పోటీలు

హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో గురువారం తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అచీవింగ్ స్పోర్ట్స్ మైల్‌స్టోన్ బై ఇన్‌స్పైరింగ్ ఉమెన్ త్రు యాక్షన్ (అస్మిత) ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అన్ని కేటగిరీల్లో బాలికలు, మహిళలలో ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని మరింత ప్రోత్సహించాలన్నదే అస్మిత ప్రధాన లక్ష్యం. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల క్రీడాకారిణులకు ఒక్క రోజు పోటీలు నిర్వహించాలని అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్‌ఐ)కు కేంద్రం సూచించింది. కాగా, ఏఎఫ్‌ఐ నిర్వహణ బాధ్యతలను అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు అప్పగించింది.

పోటీలను మమ అనిపిస్తే చాలు..

ప్రతిభ, ప్రోత్సాహం పక్కన పెడితే కేవలం పోటీలు నిర్వహిస్తే చాలు అన్నట్లు తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ వ్యవహరించిందని టెక్నికల్ అఫీషియల్స్, సీనియర్ క్రీడాకాఱులు, కోచ్‌లు వాపోయారు. గురువారం ఉదయం 5.30 గంటల నుంచి నగరంలో దాదాపు గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో జేఎన్‌ఎస్‌లోని సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ తడిసిపోవడంతో పాటు అక్కడక్కడ నీరు నిలిచింది. దీంతో స్కిడ్ అవుతుందని క్రీడాకారులు షూ లేకుండానే పోటీల్లో పాల్గొన్నారు.

తడిసిన ట్రాక్‌పై రన్నింగ్..

తడిసిన సింథటిక్ ట్రాక్‌పై అథ్లెట్లు రన్నింగ్ చేయడానికి ఇబ్బందులు పడ్డారు. వివిధ కేటగిరీల్లో పాల్గొన క్రీడాకారిణులకు 100, 200, 400, 800, 1500 మీటర్ల రన్నింగ్‌తో పాటు డిస్కస్ త్రో, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్, ట్రిబుల్‌జంప్, హైజంప్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సుమారు 600 క్రీడాకారిణులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఖేలో ఇండియా పోటీలు నిర్వహించడం అభినందనీయమని, వచ్చే నెలలో జరిగే సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు హనుమకొండ ఆతిథ్యం ఇస్తుందన్నారు. అనంతరం విజేతలకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అజీజ్ ఖాన్, హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్, అథ్లెటిక్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, సంఘం బాధ్యులు ఐలి చంద్రమోహన్‌గౌడ్, ఎండీ గౌస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న చీఫ్‌విప్


వర్షంలోనే చెట్టు కింద భోజనం చేస్తున్న క్రీడాకారిణులు


షాట్‌పుట్ విసురుతున్న క్రీడాకారిణి

మేడారంలో సకల సౌకర్యాలు

- దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- లోపాలు తలెత్తకుండా జాతర ఏర్పాట్లు చేపట్టాలి : మంత్రి సత్యవతి రాథోడ్
- వీవీఐపీ అతిథి గృహ సముదాయ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన
- మహాజాతర ఏర్పాట్లపై సమీక్ష


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి


ములుగులో వ్యవసాయశాఖ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు

ఎస్ఎస్ తాడ్వాయి/ములుగు రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మేడారంలో తీవ్ర నష్టం వాటిల్లిందని, జాతరకు ముందుగానే మరమ్మతులు పూర్తి చేసి భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. గురువారం మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహంలో మహాజాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.14 కోట్లతో మేడారంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశామన్నారు. పస్రా – మేడారం రోడ్డులో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నట్లు వివరించారు. రూ.12కోట్ల వ్యయంతో ప్రత్యేక గదులు, డార్మెటరీలను నిర్మిస్తున్నామన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే సమ్మక్క సారలమ్మ మహాజాతరలో లోపాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత నాలుగు దఫాలు జరిగిన జాతరలో రూ.400 కోట్లతో భక్తులకు సౌకర్యాలు కల్పించామన్నారు. 2024లో జరిగే జాతరను విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఆరు నెలల ముందు నుంచే జాతర ఏర్పాట్లపై ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఆదివాసీ బిడ్డ నాగజ్యోతిని గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారన్నారు. సీఎం కేసీఆర్.. ములుగు జిల్లాకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. మల్లంపల్లి మండలం, ఏటూరునాగారం డివిజన్ ఏర్పాటుకు త్వరలోనే ఏర్పాట్లు జరగనున్నాయని తెలిపారు. ఈనెల 28న మంత్రి హరీశ్‌రావు జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవానికి హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

మేడారానికి వచ్చిన మంత్రులు సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్‌రెడ్డి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హెలీపాడ్ పక్కన స్థలంలో రూ.2.15 కోట్లతో నిర్మించనున్న వీవీఐపీ అతిథి గృహ సముదాయ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు ములుగు జిల్లాకేంద్రంలో వ్యవసాయశాఖ కార్యాలయం ప్రారంభించారు. ఇంచర్ల జీపీ పరిధిలోని గిరిజన సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో రూ. 5 కోట్లతో నిర్మించనున్న భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, రెడ్‌కో చైర్మన్ సతీష్‌రెడ్డి, రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, ఎస్పీ గౌష్ ఆలం, ఐటీడీఏ పీఓ అంకిత్, ఈఓ రాజేంద్రం, ఎంపీపీ వాణిశ్రీ, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు, సర్పంచ్ శిడం బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

నవంబర్‌లో జాతీయ మహాసభలు

- అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ మహాసభల ఆహ్వాన కమిటీ చైర్మన్ వినోద్ కుమార్


మాట్లాడుతున్న వినోద్‌కుమార్

హన్మకొండ: అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ మహాసభలు నవంబర్ 19, 20, 21 తేదీల్లో హనుమకొండ వేదికగా జరగనున్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ మహాసభల ఆహ్వాన కమిటీ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు. గురువారం హనుమకొండ కాకతీయ కాలనీలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగిన సమయంలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను పలుమార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వాలు గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. అనంతరం జాతీయ మహాసభల వైస్ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ చారిత్రక నగరం హనుమకొండలో జాతీయ మహాసభలు నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి జయరాజు మాట్లాడుతూ సభలకు దేశ వ్యాప్తంగా 3 వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాజేందర్ రెడ్డి, హనుమకొండ డివిజన్ కార్యదర్శి బొద్దున వెంకటేశ్వర్లు, కోశాధికారి మర్రి కొమురారెడ్డి, 'కుడా' చైర్మన్ సుందర్ రాజు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అజీజ్ ఖాన్ పాల్గొన్నారు.

డీన్ల పారదర్శకతను తప్పుపట్టడం హాస్యాస్పదం

కేయూ క్యాంపస్: డీన్ల పారదర్శకతను తప్పుపట్టడం హాస్యాస్పదమని కాకతీయ యూనివర్సిటీ ఆల్ ఫ్యాకల్టీ డీన్లు అయిలయ్య, మల్లారెడ్డి, మనోహర్, నర్సింహారెడ్డి, అమరవేణి, రాంనాథ్ కిషన్, విజయలక్ష్మి శ్రీనివాసులు గురువారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్లు పారదర్శకంగానే నిర్వహించామని డీన్లు అందరం ఒక ప్రకటన జారీచేశామని, ఆ ప్రకటన సమాజాన్ని దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా విడుదల చేసిందన్నారు. ఆ ప్రకటనను అపహాస్యం చేస్తూ కేయూ డీన్లు పారదర్శకతను నిరూపించుకోవాలంటూ కేయూ జేఏసీ పేరున విడుదల చేసిన ప్రకటన హాస్యాస్పదంగా ఉందని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. డీన్లు వీసీ చేతిలో కీలుబొమ్మలంటూ జేఏసీ చేసిన ఆ ప్రకటన సరికాదన్నారు. స్వార్థపరుల చేతిలో కీలుబొమ్మలుగా మారి తమ విలువైన కాలాన్ని వృథా చేసుకోవద్దని డీన్లుగా తాము విద్యార్థులకు విన్నవిస్తున్నామన్నారు.

మెస్‌కార్డుల రెన్యూవల్ వివాదం..

- బకాయిలు చెల్లించలేమంటున్న విద్యార్థులు
- కనీసం రూ 2,500 చెల్లిస్తేనే రెన్యూవల్ : హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్య

కేయూక్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పూర్తయి మూడో సెమిస్టర్‌లోకి ప్రవేశించిన విద్యార్థులకు హాస్టల్‌వసతి మెస్‌కార్డుల రెన్యూవల్ ప్రక్రియ మొదలైంది. కాగా, గత విద్యాసంవత్సరానికి సంబంధించి స్కాలర్‌షిప్‌లు పోనూ మిగతా బకాయిల్లో కనీసం రూ . 2,500 మరో రూ. 200 మొత్తం రూ. 2,700 చెల్లించి మెస్‌కార్డులు రెన్యూవల్ చేసుకోవాలని కేయూ హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్య కోరుతున్నారు. అయితే తాము మెస్‌బకాయిలు ఇప్పుడు చెల్లించలేమని విద్యార్థులు పేర్కొంటున్నారు. రూ. 200 చెల్లిస్తామని, మెస్ కార్డులు రెన్యూవల్ చేయాలని వారు పట్టుబడుతున్నారు. ఈమేరకు గురువారం హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్యతో వాగ్వాదానికి దిగారు. స్కాలర్‌షిప్‌లు పోనూ రూ. 8వేల నుంచి రూ. 10వేల వరకు మెస్‌బకాయిలు చెల్లించాల్సిన విద్యార్థులున్నారని, అందుకే అందులో కనీసం రూ. 2,500 చెల్లించాలని డైరెక్టర్ విద్యార్థులతో పేర్కొన్నారు. కనీసం వందమంది విద్యార్థులు మెస్‌కార్డులు రెన్యూవల్ చేసుకుంటేనే క్యాంపస్‌లోని కామన్ మెస్ ఓపెన్ చేస్తామని డైరెక్టర్ వెంకయ్య తెలిపారు. కాగా, మహిళా హాస్టల్ విద్యార్థినులకు మెస్‌బిల్లులు కొంత తక్కువగా వస్తున్నాయి. దీంతో ఆయా విద్యార్థినుల బకాయిలు తక్కువ ఉన్నాయి. స్కాలర్‌షిప్‌లు పోనూ బకాయిలు చెల్లించి ఇప్పటివరకు 60నుంచి 70మంది వరకు రెన్యూవల్ చేసుకున్నారు. దీంతో వారికి గురువారం నుంచి మెస్ సౌకర్యం కల్పిస్తున్నారు.

'తానా' సాహిత్య సదస్సుకు లావణ్య


లావణ్య

జనగామ : అంతర్జాతీయ స్థాయిలో జరుగనున్న సదస్సుకు జనగామ జిల్లా కేంద్రానికి చెందిన కవయిత్రి బుద్దా లావణ్య ఎంపికయ్యారు. తానా (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన అంతర్జాతీయ శతాధిక కవయిత్రుల సమ్మేళనంలో భాగంగా 'నారీ సాహిత్య భేరీ' నిర్వహించనున్నారు. ఇందులో జనగామకు చెందిన కవయిత్రి బుద్దా లావణ్య తన ప్రతిభ చాటుకోనున్నారు. ప్రపంచంలోని 15 దేశాల నుంచి పోటీ పడుతుండగా, దేశం నుంచి కేవలం 20 మంది కవయిత్రులను మాత్రమే ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బుద్దా లావణ్య గురువారం విలేకరులతో మాట్లాడుతూ తానా సంఘం.. ఔత్సాహిక రచయితలను ప్రోత్సహించేలా కృషి చేస్తోందన్నారు. అంతర్జాతీయ వేదికపై తనకు అవకాశం వచ్చేలా కృషి చేసిన తెలుగు వెలుగు సాహిత్య వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మోటూరి నారాయణరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, కవయిత్రి లావణ్యను జరసం అధ్యక్షుడు అయిలా సోమనర్సింహాచారి, కవులు కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు జి.కృష్ణ, కవి హృదయం సాహిత్య వేదిక అధ్యక్షుడు పెట్లోజు సోమేశ్వరాచారి, తెరసం జిల్లా అధ్యక్షుడు పానుగంటి రామమూర్తి, తెరవే రాష్ట్ర కార్యదర్శి జోగు అంజయ్య, తానా సమన్వయ కర్త చిగురుమళ్ల శ్రీనివాస్, అధ్యక్షుడు నిరంజన్, నిర్వాహకుడు తోటకూర ప్రసాద్ అభినందించారు.

జూనియర్ సివిల్ జడ్జిల నియామకం, బదిలీ

వరంగల్ లీగల్ : రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ సివిల్ జడ్జిల బదిలీలు, ఖాళీ పోస్టులను భర్తీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ (విజిలెన్స్) గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బదిలీ చేసిన ఇద్దరు జడ్జిల స్థానాలతో పాటు ఖాళీగా ఉన్న ఐదు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు న్యాయమూర్తులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ జువెనైల్ కోర్టు జడ్జి నేరెళ్ల వెంకటహైమా పూజితను జోగులాంబ గద్వాల పీడీఎం కోర్టు జడ్జిగా బదిలీ చేస్తూ, ఆ స్థానంలో నందికొండ రితికాను నియమించారు. జనగామ జువెనల్ కోర్టు జడ్జి సీహెచ్ నర్మదను రంగారెడ్డి జిల్లా ఎల్‌బీ నగర్ కోర్టుకు బదిలీ చేయగా, ఆ స్థానానికి కొప్పుల సందీపను నియమించారు. ఖాళీగా ఉన్న వరంగల్ రెండో మున్సిఫ్ కోర్టు జడ్జిగా బి.వెంకటచంద్ర ప్రసన్న, మూడో మున్సిఫ్ కోర్టు జడ్జిగా ఎ.హరికాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ జిల్లాలో ఖాళీగా ఉన్న నాలుగో మున్సిఫ్ కోర్టు జడ్జిగా మహ్మద్ ఫరిహాఅహ్మద్, పీసీఆర్ కోర్టు జడ్జిగా చెన్ను లీలా నాగసుస్మితను నియమించారు. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా జువెనల్ కోర్టు జడ్జిగా గంగినేని అఖిలను నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎల్ఎల్ఎం పరీక్ష ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఎల్ఎల్ఎం రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 30 వతేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించాలన్నారు. రూ 250 అపరాధ రుసుముతో అక్టోబర్ 4వతేదీ వరకు గడువు ఉందన్నారు.

ఎల్ఎల్‌బీ మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు

కేయూ పరిధిలో ఎల్ఎల్‌బీ మూడేళ్ల రెండో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ పరీక్షల టైంటేబుల్‌ను విడుదల చేసినట్లు పరీక్షల విభాగం అధికారులు మల్లారెడ్డి, రాధిక తెలిపారు. రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25, 27, 30, అక్టోబర్ 4, 6 వతేదీల్లో జరుగుతాయని తెలిపారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 29, అక్టోబర్ 3, 5, 7వ తేదీల్లో జరుగుతాయని తెలిపారు.

ఐదేళ్ల 'లా' కోర్సు రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు

కేయూ పరిధిలో ఐదేళ్ల 'లా' కోర్సు రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25,27, 30, అక్టోబర్ 4వ తేదీల్లో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 29, అక్టోబర్ 3, 5వతేదీల్లో జరుగుతాయి. వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు.

ఉడుమును పట్టుకున్న యువకుడు.. కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : మూగజీవి ఉడుమును పట్టుకుని ఉన్న ఓ యువకుడి ఫొటోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. దీంతో అటవీ శాఖ అధికారులు.. ఆ యువకుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు గురువారం అటవీ శాఖ మహబూబాబాద్ రేంజ్ కార్యాలయంలో డోర్నకల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి రేణుక కేసు వివరాలు వెల్లడించారు. కురవి మండలానికి చెందిన జీ రఘు తన చేతిలో ఓ ఉడుమును పట్టుకుని ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆ ఫొటోలను 'ఎనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' సభ్యుడు గౌతమ్ అటవీ శాఖ ఉన్నతాధికారులకు పంపించి ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు డోర్నకల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి రేణుక, సెక్షన్ అధికారి శ్రీనివాస్ .. రఘును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

విహారం.. విషాదం..

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు
- ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం
- నలుగురికి తీవ్ర గాయాలు


నిస్సి (ఫైల్)

ములుగు రూరల్ /కాజీపేట అర్బన్: వరంగల్ నిట్ విద్యార్థుల విహారయాత్ర విషాదమైంది. పర్యాటక ప్రాంతాలను సందర్శించి తిరుగు ప్రయాణమైన వారి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పక్కన ఆగి ఉన్న లారీ కిందికి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి మృతిచెందగా, మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున ములుగు మండలం జంగాలపల్లిలో జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ముర్తుజా, ఉమర్, సాయి, సుజిత్, ఏపీలోని విజయవాడకు చెందిన శ్రేయ, తాడేపల్లిగూడేనికి చెందిన నిస్సి సిజు.. వరంగల్ నిట్‌లో బీటెక్ సివిల్ ఇంజనీరింగ్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ములుగు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. తిరుగు ప్రయాణంలో ములుగు మండలం జంగాలపల్లిలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారులో ఉన్న ఆరుగురు విద్యార్థుల్లో నిస్సి సిజు (19) అక్కడిక్కడే మృతి చెందింది. ఈ ఘటనను చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ రంజిత్ కుమార్, ఎస్సై వెంకటేశ్వర్ వెంటనే ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను 108లో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. సాయి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. మిగతా విద్యార్థులు శ్రేయ, ముర్తుజ, ఉమర్, సుజిత్‌కు తీవ్ర గాయాలు కావడంతో హనుమకొండలోని రోహిణి ఆస్పత్రికి తరలించారు. నిస్సి మృతదేహాన్ని ములుగు ఏరియా ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. కాగా, రోడ్డు ప్రమాదంలో ఫ్రైండ్ మృతి చెందిన విషయం తెలుసుకొని నిట్ విద్యార్థులు ములుగు ఏరియా ఆస్పత్రికి వచ్చి బోరున విలపించారు. మృతురాలి కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంటతడికి గురి చేశాయి. కాగా, బాధిత కుటుంబాలను మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజ్మీరా ప్రహ్లాద్ పరామర్శించారు.

ఏడు నెలలు గడవకముందే..

నిట్ వరంగల్‌కు చెందిన థర్డ్ ఇయర్ విద్యార్థి రిత్విక్ ఏడు నెలల క్రితం క్యాంపస్ నుంచి రాత్రి పది గంటలకు బయలుదేరి ఆరెపల్లి ప్రాంతంలోని వంగపహాడ్ దగ్గర బైక్‌పై ప్రయాణిస్తూ ప్రమాదంలో మృతి చెందాడు. రిత్విక్ మృతి చెంది ఏడు నెలలు గడవకముందే నిట్‌కు చెందిన మరో ఆరుగురు విద్యార్థులు కారు యాక్సిడెంట్‌కు గురికావడం.. ఇందులో ఒకరు మృతి చెందడం పలువురిని కంటతడికి గురి చేసింది.

రోజూ బయటకు ఎందుకు..?

నిట్ క్యాంపస్‌లో 6వేల మంది విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు క్లాస్ రూంలు, ల్యాబ్స్, సెమినార్ హాల్స్ ఉన్నాయి. అలాగే, భోజనం, వసతికి బాలురకు 1కే,1.8కే, బాలికలకు న్యూ,ఓల్డ్ బ్లాక్, ప్రియదర్శిని బ్లాక్‌ల్లో వసతి ఏర్పాట్లకు గాను కళాశాల ఫీజుతోపాటు మెస్‌కు గాను ఏడాదికి రూ. 14వేలు తీసుకుంటున్నారు. రోజూ ఉదయం టీ, టిఫిన్, లంచ్, డిన్నర్, స్నాక్స్ అందిస్తుంటారు. ఇలా రోజూ అందిస్తున్నా ఫుడ్ కోసం విద్యార్థులు బయటకు ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించే నాథులే లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా నిట్ యాజమాన్యం విద్యార్థులకు భద్రత కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇలా జరుగుతుందని అనుకోలేదు..



నేను, నా మిత్రులు ముర్తుజా, ఉమర్, సాయి, శ్రేయ, నిస్సి ఫుడ్ కోసం హనుమకొండ బాలసముద్రంలోని ఓ హోటల్‌కు వెళ్లాం. అక్కడ ఆలస్యం కావడంతో సరదాగా కారులో లక్నవరం బయలుదేరాం. కానీ రోడ్డు ప్రమాదం అవుతుందని, మాకు ఇలా జరుగుతుందని అనుకోలేదు. గురువారం తెల్ల వారుజామున చోటుచేసుకున్న ప్రమాదంలో అసలేం జరిగిందో అర్థం కాలేదు. లారీ ఒక్కసారిగా ఓవర్ టేక్ చేయడంతో కారు నడిపే మా స్నేహితుడికి ఏం చేయాలో తెలియలేదు.

-సుజిత్, నిట్ విద్యార్థి


నుజ్జునుజ్జయిన కారును తొలగిస్తున్న పోలీసులు